


# ఏది నిజం?

మురళీధర్

రిక్షా మలుపు తిరిగింది. శేఖర్ ఇల్లు కనబడుతుంది.

నెమ్మదిగా రిక్షా దిగి రూపాయి రిక్షా పుల్లర్ కిచ్చి లోపలికి అడుగు పెట్టాను.

వరండాలో క్రింద ఖాళీస్థలంలో వేసిన కుర్చీలు, చాపల మీద చాలా మంది కూర్చున్నారు. గేటు చప్పుడుకు వెనక్కు తిరిగిన రఘు "అన్నయ్యా! బావగారొచ్చారు" అంటూ నా చేతిలో సూట్ కేస్ తీసుకున్నాడు.

నేను, శేఖర్ చిన్ననాటి మిత్రులం. మొదటి నుండి 'ఒరే బావా' అని ఒకరి నొకరు పిల్చుకోవటం అలవాటు. రఘు బావగారనే పిలుస్తాడు.

"ఏరోయ్ బావా! ఇప్పుడా వచ్చేది? అమ్మాయేది? నీవెందుకు తీసుకు వస్తావురా రాస్కెల్!" నా సమాధానికి ఆగకుండా చెయ్యి బట్టుకుని లోపలి గదిలోకి లాక్కెళ్ళాడు శేఖర్.

ఆ గదిలో అంతా ఆడవాళ్ళున్నారు. తెలిసిన వారు పలకరించారు. తెలియని వారు 'ఎవరని' పక్కవాళ్ళ చెవులు కొరుకుతున్నారు. మళ్ళా మాటలు. వారి

మాటలకు నేపథ్య సంగీతంలా వినబడుతుంది పదికొండు రోజుల క్రితం ఈ లోకానికి వచ్చిన ప్రాణిస్వరం. అదుగో ఆ-ప్రాణిని చూడటానికి, ఆ ఆనందంలో పాలు పంచుకోటానికే నేనిక్కడకు వచ్చింది.

"అన్నయ్యాగారూ! ఎంత సేపయింది వచ్చి?" అంటూనే "కాఫీ అన్నా త్రాగారా మా అన్నయ్య? పుత్రికారత్నాన్ని చూపించడమే మీకు ముఖ్యమా?" అన్నది మాధవి.

"ఏమయ్యా శేఖర్! ఏడి మీ మా మావగారు? ఎక్కడికెళ్ళాడు? పూజకు వేళవుతుంది. ఇక్కడ నీవేమి చేస్తున్నావ్? అన్నట్లు మరిచాను. చిల్లర డబ్బులు, ఖర్జూరాలు ఎక్కడ పెట్టారు? త్వరగా తెమలండి. అమ్మాయ్ మాధవీ! పిల్లను ఒళ్ళో వేసుకుని ముచ్చట్లాడుతుంటే పని జరగదమ్మా! లేవండి" ఎవరి సమాధానం కోసం ఆగకుండా అలా ఆర్డర్లు వేస్తున్న శాస్త్రిగార్ని చూసి పక్కకు తప్పుకున్నాను. శేఖర్. "ఇప్పుడే వస్తాగా! రా-రా వరండాలో కూర్చో. రఘూ! కాఫీ యివ్వు" అని ఊడిపోతున్న గోచీ పెట్టుకుంటూ వెళ్ళాడు.

రఘు యిచ్చిన కాఫీ తీసికొని వరండాలో ఒక మూల ఉన్న పడక్కుర్చీలో నడుం వాల్చాను. ఒక్కసారి గతం కళ్ళ ముందు మెదిలింది.

ఎలిమెంటర్ స్కూలునుండి, కళాశాల వరకు - నేను శేఖర్ సహాధ్యాయులం. ఎం.ఏ చేసి ఈ వూళ్ళో ఇంగ్లీషు లెక్చరర్‌గా స్థిరపడ్డాడు శేఖర్. తర్వాత స్వంత యిల్లు కట్టుకున్నాడు. ఇంజనీరింగు పూర్తి చేసి హైదరాబాద్‌లో అసిస్టెంటు ఇంజనీరుగా పని చేస్తున్నాను నేను. జీవిత మార్గాలు వేరగుట వలన, అప్పుడప్పుడూ కలుసుకుంటున్నా-ఉత్తరాల ద్వారా పల్కరించుకోవడమే ఎక్కువ.

ఉద్యోగంలో చేరిన రెండు సంవత్సరాలకు తనకు నచ్చిన పెద్దలు మెచ్చిన మాధవి మెళ్ళో మూడు ముళ్ళు వేశాడు శేఖర్. వాళ్ళిద్దరిదీ అన్యోన్యమైన దాంపత్యం.

శేఖర్ ఒక రకమైన నాస్తికుడు. దేవుడు లేడని వాదించడు. అనుభవానికతీతమైన విషయం గురించి తర్కం అనవసరమంటాడు. ప్రతి విషయం హేతుబద్ధంగా ప్రాక్టికల్‌గా ఆలోచి



స్తాడు. తన అభిప్రాయాలను ఇతరులపై రుద్దటానికి ప్రయత్నం చెయ్యడు.

మాధవి నూటికి నూరుపాళ్ళు ఆస్తికురాలు. ఉదయం ఏడు గంటలకు స్నానం చేసి పూజకు కూర్చుంటే తొమ్మిది గంటలకే లేచేది. లక్ష్మీ స్తోత్రం, విష్ణు సహస్ర నామ స్తోత్రం, సుబ్రహ్మణ్యాష్టకం, ఒకటేమిటి-ముక్కోటి దేవతలను పూజిస్తుంది.

"బావగారూ! వక్క పొడి" అన్న మాటలతో వర్తమానానికి వచ్చాను

శేఖర్, మాధవి పీటలపై కూర్చున్నారు బాలసార కార్యక్రమం యథావిధిగా జరిగిపోతోంది. శాస్త్రిగారు తనను మించినవాడు ఆ పరగణాలో లేడన్నట్లు మంత్రాలు చదువుతున్నాడు.

ఆడవారు మాధవిని, శేఖర్‌ను వేళాకోళం చేస్తున్నారు. తలంటి పోసుకున్నందున ఆగని జుట్టు దుబ్బులాగా ఉండి కొంత గాలి కెగురుతుంటే శేఖర్ కొత్తగా కనబడుతున్నాడు.

కంచి పట్టు చీరెలో, తలంటు పోసుకోవటం వలన గాలికెగురుతున్న ముంగురులతో, జుట్టు ముడి వేసుకుని, పెద్ద కుంకుమ బొట్టుతో, తొలి మాతృత్వపు ఆనందం వెల్లి విరియగా ఒక పవిత్ర భావాన్ని కలుగ జేస్తుంది మాధవి. ఎక్కడ చూసినా ఆనందం, వేళాకోళాలు. ఇంత పండుగకు కేంద్రమైన పదకొండు రోజుల పాప తనకేమీ పట్టనట్లు నిద్రపోతోంది.

* * *

"ఏమయ్యా, ఇంజనీరూ! ఇలా రా!" అన్న పిలుపుతో పిచ్చయ్య శాస్త్రిగారి దగ్గరకు వెళ్ళాను. ఆయన చుట్టూ ఓ పది మంది కూర్చున్నారు. శాస్త్రిగారు కుర్చీలో కాళ్ళు పైకి పెట్టుకొని కూర్చుని తెల్లటి గడ్డం సవరించుకుంటూ "జ్యోతిశ్శాస్త్ర ప్రభావం చూశావుటయ్యా?" అని మొదలు పెట్టారు.

"అసలు శేఖర్‌కు కుజ దోషం ఉంది. అమ్మాయి మాధవికి నాగ

దోషం ఉంది. ఐతే మాధవికి కూడా కుజదోషం ఉండటంవలన వీరి వివాహాన్ని నేనే పెద్దగా వుండి జరిపించాను. వీరి జాతకరీత్యా సంతానం ఆలస్యంగా కలుగుతుందనీ, నాగదోష నివారణార్థం రామేశ్వరంలో నాగ ప్రతిష్ఠ చేయాలనీ చెప్పాను. సుమారు పది సంవత్సరాలు గడిచిన తరువాత సంతాన యోగం వుంటుంది. ఈ లోపల కొన్ని లక్షలసార్లు విష్ణు సహస్ర నామస్తోత్రం, సుబ్రహ్మణ్య అష్టకం చెయ్యాలంటే విన్నాడా శేఖరు? అసలు నా మాట వింటే కదండీ! డాక్టర్లన్నాడు, పరీక్షలన్నాడు, డి అండ్ సి చేయించాడు. తను - హవ్వ-నవ్వుతారండీ ఎవరైనా వింటే, తను పరీక్ష చేయించుకొన్నాడట! ఆఖరుకు ఆ రేణుకమ్మ సలహా ననుసరించి రెండు సంవత్సరాల క్రితం అమ్మాయికి మేజర్ ఆపరేషను కూడా చేయించాడట!! ఏదీ సంతానం? ఇవేమైనా చెట్టును కాసిన కాయలా కోసుకోరావటానికి? యోగం ఉండాలండీ దేనికైనా. గ్రహబలం కలిసి రావాలి. అవును కాని ఇంజనీరూ! నీకు ఏమి చెప్పాను? ఉద్యోగం నీ ఇరవై ఆరవ ఏడులో కాని రాదని చెప్పానా? అయ్యా, పరంధామయ్య గారూ! ఈయన ఇరవై నాల్గవ ఏట నుండి విశ్వప్రయత్నం చేశాడండీ ఉద్యోగానికి. కని ఉద్యోగం యిస్తాడటండీ? దశ మారింది. హైదరాబాదులో ఇప్పుడు ఇంజనీరుగా చేస్తున్నాడు. జాతక ప్రభావాన్ని ఎవరూ తప్పించలేరండీ! శేఖర్‌కు దశ మారింది. అమ్మాయి మాధవి ఈ కాలపు పిల్ల కాదండీ-స్వామీ! పట్టుబట్టి పోయిన సంవత్సరం రామేశ్వరంలో నాగప్రతిష్ఠ చేయించింది. సెలవు దొరకదని తప్పించుకో జూసినా శేఖర్‌కు రామేశ్వరం పోక తప్పలేదు. నేను చెప్పిన పూజలు, స్తోత్రాలు తు చ తప్పకుండా చేసింది. ఇదిగో లక్ష్మీదేవి అవతరించింది. ఇవాళ మనందరకు బాలసార వస్తున్నాం. డాక్టర్లేమి చేస్తారండి కర్మకు? ఎన్ని ఆపరేషన్లు చేసినా గ్రహబలం లేనిదే సంతానం కలగదండీ!'' అని తన సుదీర్ఘమైన ఉపన్యాసాన్ని ఆపి మరొకసారి నశ్యం పీల్చి అందరూ శ్రద్ధగా వింటున్నారా అని చూశాడు. "అసలు శాస్త్రం ఏమి చెపుతుందంటే," అని మొదలు పెట్టేసరికి, "అన్నయ్య గారూ! రేణుకాదేవిగారు పిలుస్తున్నారు" అన్న పిలుపుతో అక్కడి నుండి లేచాను.

"హల్లో మిష్టర్ శేఖర్! హౌడు యూడూ!" అని పల్కరించారు, డాక్టరు రేణుకాదేవి-గైనాకాలజీ ప్రొఫెసరు. "ఫైన్ మేడమ్!" అంటూ దగ్గరలో ఉన్న కుర్చీ లాక్కుని కూర్చున్నాను. రేణుకాదేవి కాలేజీలో చదివే టపుడు నేను, శేఖర్ హైస్కూలులో ఉన్నాం. తరవాత ఎం. బి. బి. ఎస్, ఎం. డి. చేసి మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పని చేశారు. విదేశాలలో డిగ్రీలు తీసి కొని ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఒకే ఊరి వారం కావడం వలన, శేఖర్‌కు దూరపు బంధుత్వం వలన బాగా పరిచయం. ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉండటంవలన ఆమె ఫారిన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత కలుసుకోవటం ఇదే మొదటిసారి. ఇంతలో "అయ్యా! కట్నాలు చదివించండి!" అన్న శాస్త్రిగారి కేకతో "డాక్టర్! ఒన్ మినిట్." అని లోపలికి వెళ్ళి పాపకు నేను తెచ్చిన ముత్యం పొదిగిన ఉంగరం ఇచ్చి వచ్చేసరికి రేణుకాదేవి లెక్చర్ ఇస్తున్నారు. చుట్టూ కొంతమంది హౌస్ సర్జన్స్, ఫైనలియర్‌లో ఉన్న మెడికల్ స్టూడెంట్స్—ఆ ఊరివారు, శేఖర్‌కు పరిచయమున్నవారు—గడ్డాలక్రింద చేతులు పెట్టుకొని కూర్చొని, ఆమె చెప్పేది శ్రద్ధగా వింటున్నారు.

"ఇప్పుడు మన మాధవి విషయం చూడండి. మూఢ నమ్మకాలతో, పూజలనీ, యాత్రలనీ ఎంత టైమ్ వేస్ట్ చేశారో! జాతక ప్రభావం, కర్మ పరిపక్వం!! మానవుడు చంద్రమండలంపై కాలు పెట్టిన తరవాత కూడా గ్రహాలు, బలాలు అంటే ఎలా?—జస్ట్ సూపర్‌స్టిషన్. ఈ మేజర్ ఆపరేషను మాధవికి ఇదివరలో చేసినట్లయితే, శేఖర్ ఇద్దరు బిడ్డలకు తండ్రై వేసక్టమీ కూడా చేయించుకునేవాడు. నేను ఫారిన్ వెళ్ళే ముందు చెప్పాను- 'మాధవి కేసు పెక్యూలియర్' అని. ది యూటిరస్ ఈజ్ రెట్రోవర్ట్. అంటే యూటిరస్ మామూలు పొజిషన్‌లో ఉండక కొద్దిగా వెనక్కు టిల్ట్ అవుతుంది. గర్భం రావటం ఈ పరిస్థితులలో చాలావరకు సంభవించదు. ఒకవేళ వచ్చినా యూటిరస్ పెరుగుదలకు పెల్విక్ బోను అడ్డం రావచ్చు. అప్పుడు అబార్షన్ జరుగుతుంది. ది సేమ్ థింగ్ హాపెండ్ హియర్. శేఖర్ నాకు చెప్పినపుడు ఎవ్వరూ అంత అంగీకారం చూపకపోయినా, శేఖర్

అంగీకారంపై మాధవిని ఒప్పించి ఆపరేషను చేయాల్సి వచ్చింది. అప్పుడు కూడా 'నాగదోషం' అంటుంది గాని, నేను చెప్పింది నమ్మదే! షిడజ్‌నాట్ హావ్ పెయిత్ ఇన్ సైన్స్. రెండేళ్ళు కావస్తుంది. నౌ షిఈజ్ బ్లెస్డ్ విత్ ఎ బేబి. వాట్ ఇంజనీర్! ఏమంటున్నాడు పిచ్చయ్యశాస్త్రిగారు? అంతా జాతక మహిమ అంటున్నాడా?" అంటూ నవ్వింది.

"ఇంజనీరు అన్నయ్యగారండీ! ఇదిగో సాయిబాబా ప్రసాదం!" అంటూ ఏడేళ్ళ పాప, మాధవి చిన్న చెల్లెలు నాకు ప్రసాదం యిచ్చింది.

హాలు ప్రక్కన గదిలో సాయి బాబా పటం ఉంది. కొందరు భక్తులు భజన పూర్తిచేసి, మంగళ హారతి యిచ్చి ప్రసాదం తీసు కుంటున్నారు.

"పాపా! భజన ఎవరు చేయిం చింది?" అని అడిగాను. "మా అమ్మగారేనండీ! మా మాధవ క్కకు పిల్లలు పుట్టకపోతే, షట్ట పర్తి మాఅమ్మ, బావ, మాధవక్క- నేను-వెళ్ళాం. అక్కడ సాయి బాబా స్వామివారు విభూది యిచ్చి సంవత్సరంలో పిల్లలు పుడతారని చెప్పారు. అట్లాగే మా అక్కకు పాప పుట్టిందిగా!" అంటూ తుర్రు మంది ఆ అమ్మాయి.

కడుపులో ఆకలి కరకర మంటుంది. "అయ్యా! స్నానాలు చెయ్యండి వడ్డించేస్తున్నారు!" అన్న పిలుపుతో నెమ్మదిగా లేచి టైం చూశాను- ఒంటిగంట. భోజ నాలు పూర్తయేసరికి రెండు.

"నాయనా, శేఖర్! మరి నేను వెళ్ళరానా!" అన్న పిచ్చయ్య శాస్త్రి గారితో "ఉండండి శాస్త్రిగారూ!" అంటూ "మాధవీ!" అని పిలిచాడు శేఖర్.

లోపలినుండి పళ్ళెంతో వచ్చింది మాధవి. పళ్ళెంలోనుండి నూరవనెంబరు జరీ ధోవతుల చాపు. పండ్లు, తాంబూలం ఇచ్చి శేఖర్ మాధవీలు శాస్త్రిగారికి పాదాభి వందనం చేశారు. తాంబూలంలోని 'దక్షిణ' బొడ్లో దోపుకుంటూ, "దీర్ఘాయుష్మాన్ భవ! దీర్ఘ సుమంగళీభవ! శ్రీఘ్రమే సుపుత్రా ప్రాప్తిరస్తు!" అంటూ దీవించి భుక్తాయాసంతో త్రేనుస్తూ శాస్త్రి గారు వెళ్ళిపోయారు.

"వుయ్ షల్ టేక్ లీవ్ ఆఫ్ యూ!" అంటూ వచ్చారు రేణుకా దేవి.

"అక్కయ్యా! నీవు కూడా వెంటనే వెళ్ళాలా? ఈ రాత్రికి

ఉండండి" అన్నాడు శేఖర్.

"నో! ఐ కాంట్ స్టే హియర్. వాళ్లేరు వెళ్ళాలి" అని రేణుకాదేవి అంటూంటే మాధవి వైపు చూశాడు శేఖర్.

ఒక పళ్లెంలో పట్టు చీరె, బ్లౌజ్ పీసు, పండ్లు, తమలపాకులతో వచ్చి రేణుకాదేవికి యిచ్చి నమస్కరించింది మాధవి.

"నాయనా, శేఖర్! సాయిబాబా ప్రసాదం తీసికొన్నావా? స్వామి వారికి ఉత్తరం వ్రాశావా? ఇహ నుండి ప్రతి గురువారం మనింట్లో స్వామి వారి భజన ఏర్పాటు చెయ్యాలి. అంతా ఆయనమహిమ" అంటూన్న అత్తగారితో "అలాగే నండి! మాధవికి చెప్పండి. ఆ ఏర్పాట్లు చూస్తుంది" అన్నాడు శేఖర్ ఎంతో వినయంగా.

అంతా దాదాపు వెళ్ళిపోయారు. సూర్యుడు బాగా వాలిపోయాడు. కొబ్బరిచెట్టు క్రింద పడకుర్చీ వేసుకొని కూర్చున్నాం నేను, శేఖర్.

"ఒరేయ్ బావా! ఒక విషయం అడగనా?" అన్నాను. నేను అడగబోయేది తనకు తెలుసన్నట్లుగా నవ్వాడు.

"వెల్! నేను నాస్తికుణ్ణి. ఈ జాతకాలు, నాగప్రతిష్ఠ, సాయిబాబా భజనలు ఎందుకు సమర్థిస్తున్నావ్? అని అడుగుతావు. ఐతే ఒక్క విషయం. ఎవరి నమ్మకాలు వారివి. వాటి వలన మనకు నష్టం లేనంత వరకు వాటిని విమర్శించాల్సిన అవసరం లేదు. నేను ప్రాక్టికల్‌గా ఆలోచిస్తానని నీకు తెలుసు. అందుకే నేను 'సెమెన్ ఎనాలిసిస్' చేయించుకున్నాను. మాధవిని ఒప్పించి రేణుకక్కయ్య చేత ఆపరేషను చేయించాను. ద ట్సాల్. ఇహ నా రామేశ్వర యాత్ర, సాయిబాబా భజనలు, పిచ్చయ్య శాస్త్రిగారి జ్యోతిషం అంటావా-వాటిని జరిపి అనుసరించటం వలన తాము చెయ్యగలిగింది చేసామన్న సంతృప్తి మాధవికీ, మిగతా వారికి ఉంది. నేను చేయగలిగింది చేసానని ఎలా తృప్తి పడ్డానో, ఆధ్యాత్మికంగా తాము చేయగలిగింది చేసామని వారు తృప్తి పడ్డారు. అంతా ఆశించిన ఫలితం ఒక్కటే! కాకపోతే పాప పుట్టుక గురించి అందరూ ఎవరికి వారు ఊహించినట్లు జరిగిందని ఆనందిస్తున్నారు. ఎ స్ట్రేంజ్ కో యిన్సిడెన్స్! మరొక విషయం చెప్పనా? ఒక ప్రముఖ డాక్టరు అన్నట్లు "ప్రెగ్నెన్సీ ఈజె మేటర్ ఆఫ్ ఛాన్స్!" అని అంటూ "మాధవీ! పాపను యిలా తీసుకురా" అన్నాడు శేఖర్. నేను అలానే ఆలోచిస్తూ పడుకున్నాను.*



ఆ వేళ ఇందిరాదేవి హాస్పటల్లో నర్సుగా చేరింది శారద.

ఇంటి ఆర్థిక దుస్థితి వల్ల ఆమెకు వుద్యోగం తప్పనిసరి అయింది. ఆ హాస్పటల్లో పని చేసే నీలవేణికి శారద స్నేహితురాలు దగ్గరి బంధువు. నీలవేణి రికమండేషనుతో ఆ హాస్పటల్లో చేరగలిగింది శారద.

ఆమె నర్సు ట్రయినింగు అవలేదని-ఇందిరాదేవికి ముందే చెప్పింది నీలవేణి. అందువల్ల పనిలో చేరినప్పుడు ఆమె నేమీ ప్రశ్నలతో వేధించలేదు డాక్టరు. "పని బాగా నేర్చుకో!" అని మాత్రం అంది.

ఉద్యోగం యిచ్చిన డాక్టరుకి, ఉద్యోగం యిప్పించిన నీలవేణికి కృతజ్ఞత తెలుపుకుంది శారద.

ఆ వేళ ఉదయం తొమ్మిదికి హాస్పటలు తెరిచినది మొదలు పన్నెండింటి దాకా ఎవరో పేషంట్లు వస్తూనే ఉన్నారు. దగ్గులు, జ్వరాలు.